ప్రయాణం.. ప్రమాదభరితం

- జాతీయ రహదారిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదకరంగా మారిన అమృతానగర్ రహదారి
- సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారుల నిర్ణయం



జాతీయ రహదారిలో ఎదురెదురుగా వెళ్తున్న వాహనాలు

ప్రొద్దుటూరు క్రైం : జాతీయ రహదారుల్లో వాహనాల రాకపోకలు ఎలా ఉంటాయో మనకు తెలిసే ఉంటుంది. కార్లు, లారీలు, బైక్‌లు రయ్ మంటూ అత్యంత వేగంతో ఒకదానికి మించి మరొకటి దూసుకు వెళ్తుంటాయి. దీంతో జాతీయ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే భయమేస్తుంది. ఈ రహదారుల్లో ప్రయాణాలు చేసేటప్పుడు మిక్కిలి జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. ప్రొద్దుటూరు శివారులోని ఎన్‌హెచ్–67 ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ నిత్యం రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైంది. జాతీయ రహదారిలో ఎదురెదురుగా వాహన రాకపోకలు సాగించడమే ప్రమాదాలకు కారణం. కొత్తపల్లె పంచాయతీలోని అమృతానగర్ ప్రొద్దుటూరుకు 3 కిలో మీటర్ల దూరంలో ఉంది. బైక్‌లు, ఆటోల్లో అమృతానగర్‌కు వెళ్లడం ఒక సాహసం అని చెప్పొచ్చు. అమృతానగర్‌కు వెళ్లేందుకు మూడు మార్గాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది మదూరు రోడ్డు, జాతీయ రహదారి (రింగ్ రోడ్డు) పక్కన ఉన్న మైలవరం కాలువ రోడ్డు నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు.

తరచూ ప్రమాదాలు

కొందరు దువ్వూరు రోడ్డు మీదుగా చెన్నమరాజుపల్లె సమీపంలో నుంచి అమృతానగర్‌కు వెళ్తుంటారు. వీటిలో రింగ్ రోడ్డు సమీపంలోని మైలవరం కెనాల్ రోడ్డు మీదుగా పట్టణంలోకి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. మైలవరం కాలువ రోడ్డు నుంచి వచ్చిన వాహనాలు సమీపంలోని పట్టణంలోకి వెళ్లాలంటే జాతీయ రహదారి ఎక్కాల్సి ఉంది. తర్వాత సుమారు 150 మీటర్ల మేర జాతీయ రహదారిలో అమృతానగర్‌కు వెళ్లే వాహనాలు ఎదురుగా రాకపోకలు చేయాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. వాహనాలు ఎదురెదురుగా వెళ్లే క్రమంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీంతో రోజు ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సర్వీసు రోడ్డే ఏకైక మార్గం

రోడ్డు ప్రమాదాలు జరిగే ఈ ప్రాంతాన్ని ఇటీవల ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవే, పోలీసు, రవాణాశాఖ అధికారులు పరిశీలించారు. అమృతానగర్‌కు వెళ్లేటప్పుడు జాతీయ రహదారి ఎడమ వైపున సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిసింది.

రహదారిని పరిశీలించాం



అమృతానగర్‌కు వెళ్లే దారిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇతర శాఖల అధికారులతో కలిసి రింగ్‌రోడ్డు పక్కన ఉన్న అమృతానగర్ రహదారిని పరిశీలించాం. రింగు రోడ్డు పక్కన దిగువలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. సర్వీసు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. – బాలమద్దిలేటి, రూరల్ సీఐ, ప్రొద్దుటూరు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికారపార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని, సమష్టిగా ఎదుర్కొంటామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. ఇటీవల ఓ భూ వివాదం కేసులో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిపై అక్రమ కేసు పెట్టడంతో అరెస్టు కాబడి బెయిల్‌పై విడుదలైన సందర్భంగా గురువారం బద్వేలులోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి గోపాలస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికారపార్టీ నేతలు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి గోపాలస్వామిపై అక్రమ కేసు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా అధికారపార్టీ నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా బద్వేలు నియోజకవర్గానికి కూటమి నేతలు చేసిన మేలు ఏమిటో చెప్పాలన్నారు. అభివృద్ధిని పట్టించుకోకుండా కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, ప్రజలు వీటన్నింటిని గమనిస్తున్నారన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ కేడర్ అంతా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోలిరెడ్డి, పుత్తాశ్రీరాములు, కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు మౌలాలి, వీరనారాయణరెడ్డి, షఫి, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయరా?



ప్రొద్దుటూరు మండల తహసీల్దార్ కార్యాలయం

ప్రొద్దుటూరు : తొలగించిన రేషన్ డీలర్లను నియమించాలని స్వయంగా హైకోర్టు ఆదేశించినా అధికారులు అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు వచ్చి నెల రోజులు అయినా అధికారులు ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొంత మంది డీలర్లు 40 ఏళ్లకుపైగా రేషన్ షాపులను నిర్వహిస్తూ వాటిపైనే జీవిస్తున్నారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు రేషన్ షాపులను సీజ్ చేశారు. మరి కొన్ని షాపులను సీజ్ చేయకుండానే తొలగించి తమ వర్గీయులకు కేటాయించారు. అధికారులు నేతల మాటలకు తలొగ్గి ఇష్టారాజ్యంగా చేయడంతో నియోజకవర్గంలో సుమారు వంద మంది డీలర్లను తొలగించడంతో వారు ఉపాధి కోల్పోయారు. నిబంధనల ప్రకారమే షాపులను నిర్వహిస్తున్నా ఆయా డీలర్ల వద్దకు వెళ్లి అధికారులు తమకు అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని, రాజీనామా చేయాలని కోరారు. కొంత మంది రాజీనామా చేయగా, మరికొంత మంది డీలర్లను అధికారులు అనధికారికంగా తొలగించారు. ఈ కారణంగా కొంత మంది డీలర్లు తమకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించారు. యథావిధిగా పాత డీలర్లకే రేషన్ షాపులను అప్పగించాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులు జిల్లా అధికారులకు అందాయి. అయితే అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జుననను సాక్షి వివరణ కోరగా కోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవేనన్నారు. సంక్రాంతి సెలవులు, రెవెన్యూ సదస్సుల కారణంగా ఆలస్యమైందని, వెంటనే కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని తెలిపారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి



విజేతలతో ఉపవిద్యాశాఖాధికారి, నేతాజీ సోషల్ స్టడీస్‌క్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలని ఉపవిద్యాశాఖాధికారి యు.మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక పీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మంచి వ్యక్తిగా మెలగాలంటే సాంఘిక శాస్త్రాన్ని తప్పక చదవాల్సిందే అన్నారు. విద్యార్థులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జిల్లాస్థాయిలో సోషల్ ప్రతిభా పరీక్షను ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించి నగదు బహుమతులు అందచేయడం అభినందనీయమన్నారు. ఎంఈఓ శోభారాణి మాట్లాడుతూ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా సమగ్రశిక్షా సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో 150 మున్సిపల్, ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లాపరిషత్ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రతిభా పరీక్షలో ప్రథమ స్థానంలో గంగా జశ్వంత్‌రెడ్డి, (జెడ్పీహెచ్‌ఎస్ రామిరెడ్డిపల్లె) షేక్‌సనా (జెడ్పీహెచ్‌ఎస్, ఎర్రగుంట్ల) రూ.3,000, ద్వితీయ స్థానంలో సంజనారెడ్డి(జెడ్పీహెచ్‌ఎస్, మాచనపల్లి) రూ.2,000, తృతీయ బహుమతి సాత్విక్‌రెడ్డి, హాసికా (జెడ్పీహెచ్‌ఎస్, హిమకుంట్ల) రూ.1,000, అలాగే 15 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గురుకుమార్, ప్రధాన కార్యదర్శి శాబుద్దీన్, కన్వీనర్ భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు పద్మనాభరాజు, నరసింహులు, సుబ్రహ్మణ్యం, గౌరీలత, సావిత్రి, బాబాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రొఫెసర్ వీబీ చిత్రను సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అనంతపురం జేఎన్‌టీయూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి, ప్రొఫెసర్ వీబీ చిత్ర అన్నారు. స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'మేలుకో నేటి ఆధునిక మహిళలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వీబీ చిత్ర మాట్లాడుతూ నేటి మహిళలు శారీరకంగా, మానసికంగా బలహీన పడుతున్నారని, వారు బలంగా తయారు కావాలని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు రావడంతో నేటి మహిళలు బలహీనంగా తయారయ్యారని తెలిపారు. ముడిబియ్యం, అరికెలు, సామెలు, కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు, ఆకు కూరలు, కాయకూరలు వంటి సంపూర్ణ ఆహారం తీసుకోవాలని సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి అరుణకుమార్ మాట్లాడుతూ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ 'మిషన్ శక్తి' పథకం అమలు చేస్తోందన్నారు. మహిళల భద్రత, రక్షణ, సాధికారత అంశాలను బలోపేతం చేయడానికి ఈ పథకం ఉద్దేశమన్నారు. అనంతరం ప్రొఫెసర్ చిత్రను అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, అధ్యాపకురాలు సి.భగీరథి, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేశభక్తికి నిలువెత్తు రూపం సుభాష్‌చంద్రబోస్



ప్రొద్దుటూరు కల్చరల్ : నేతాజీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశభక్తికి నిలువెత్తు రూపమని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్ రాజ్ తెలిపారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ జననం తప్ప మరణం లేని యోధుడు అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని కడప ఉక్కు పరిశ్రమ కోసం యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరికుమార్, కార్యదర్శి విశ్వనాథ్, రమేష్, చిన్న పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

ప్రొద్దుటూరు : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా స్థానిక టీబీ రోడ్డులోని ఆయన విగ్రహానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలను బీజేపీ నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి సీవీ జయలక్ష్మి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకుడు మల్లికార్జునరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ధర్మజాగరణ్ జిల్లా ప్రముఖ్ బాలరంగయ్య తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అధ్యక్షతన నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పోరాటయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

బద్వేలు అర్బన్ : పోరాటయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు జి.పుల్లయ్యలు తెలిపారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకుని గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలను పరిమిత వేగంతో నడపడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను వమ్ము చేయకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, డ్రైవింగ్ స్కూల్స్ సిబ్బంది, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం కాంతులీనుతుందని వైవీయూ ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వీసీ గురువారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ పి.పద్మ మాట్లాడుతూ ఆలోచించే సమయం తీరిక లేక..యువకులలో ఒత్తిడి, నిరుత్సాహం ఆవరిస్తోందని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొ.ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లో ఎక్కువ సమయం గడపడంతో మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని తెలిపారు. రిసోర్స్ పర్సన్లు డా.ఝాన్సీరాణి, డా.లలిత, డా.లక్ష్మినారాయణ పలు విషయాలను వివరించారు. ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త డా.ఎన్.వెంకటరామిరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీసీ సబ్సిడీ రుణాలపై స్పష్టత ఇవ్వాలి

ప్రొద్దుటూరు : బీసీ సబ్సిడీ రుణాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అధికారులు స్పష్టత ఇవ్వాలని ఏపీ రాష్ట్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు తెలిపారు. గురువారం కడపలోని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ డైరెక్టర్ జయసింహకు ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఒక్కో మండలంలో ఒక్కో విధంగా అప్‌లైడైట్ ప్రకటిస్తుండటంతో నిరుద్యోగ యువత అయోమయానికి గురవుతున్నారన్నారు. దళారుల చేతిలో బాధితులు మోసపోకుండా బీసీ కార్పొరేషన్ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

అట్లూరు : ఎస్టీ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు. మండలంలోని వరికుంటమిట్ట ఎస్టీకాలనీలో గురువారం ఆయన పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ వసతులు కల్పించడానికి చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ విస్తరణ అధికారి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

అట్లూరు : బద్వేలు మండలం అర్బన్ రైతుసేవా కేంద్రం పరిధిలోని కొండుగారిపల్లెలో గురువారం పొద్దుతిరుగుడు పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. రబీ 2024–25 సీజన్‌లో ఓ.ప్రతాప్ రెడ్డి పొలంలో ఎన్.డి.ఎస్.హెచ్ 1012 అనే రకాన్ని సాగు చేయడం 5 గీ5 మీటర్లలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 6.150 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. బద్వేలు ఏఎస్ఓ పావని ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు పి.బిందురాణి, మన్నెంసిద్ధారెడ్డిల సహకారంతో ఈ పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

కుష్టు వ్యాధి పట్ల భయం వద్దు

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధి పట్ల ఎవరూ భయపడొద్దని డాక్టర్ పద్మిని తెలిపారు. ఎండీటీ మందులు వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో గురువారం కుష్టు వ్యాధి నిర్ధారణ ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మచ్చలు, పొడలను పరిశీలించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్పర్శలేని, రాగి రంగులో మచ్చలు ఉంటే కుష్టు సంబంధిత మచ్చలుగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, కమ్యూనిటి ఆర్గనైజర్ నాగజ్యోతి, ఆరోగ్య కార్యకర్త అరుణ, ఆశా కార్యకర్త రామాంజనమ్మ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె ఎస్టీకాలనీవాసులకు పోరుమామిళ్ల చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల సహకారంతో గురువారం 90 మంది కాలనీ వాసులకు సంస్థ ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఆకులనారాయణపల్లె గ్రామ సర్పంచ్ రాములమ్మ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి కాలనీవాసులకు సంస్థ తరపున సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటారని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో గురువారం కమిషనర్ పర్యటించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఒకటో వార్డు డివిజన్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీని కమిషనర్ ఆదేశించారు. అలాగే కోనేటి కాలువ వీధిలోని రామాలయం వద్ద ఉన్న చెత్త పాయింట్ వద్ద చెత్త వేయకుండా అక్కడ ఉన్న కమర్షియల్ షాపుల నుంచి చెత్తను సేకరించాలని శానిటేషన్ విభాగం అధికారులకు కమిషనర్ తెలిపారు. కోనేటి కాలువ వీధి, మేదర వీధిలో ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సుబ్బరాయుడు, ఎస్.నూర్ బాషా పాల్గొన్నారు.

చిన్నగురువలూరులో పశు వైద్య శిబిరం



పెద్ద బాకరాపురంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న సిబ్బంది

చాపాడు : మండలంలోని చిన్నగురువలూరులో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవులకు పిరుదులు, గోమార్లు, జోరీగల బెడద ఎక్కువగా ఉంటుందని, పాడి రైతులు డీ టిక్కింగ్ మందు వేసి వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 47 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 14పశువులకు గర్భనిర్ధారణ పరీక్ష, 39 పశువులకు సాధారణ చికిత్స, 118 పశువులకు నట్టల నివారణ మందు తాగించడం జరిగిందని తెలిపారు. సిబ్బంది శివ, సోహైల్, సిద్దయ్య, దేవకుమార్ పాల్గొన్నారు.

దువ్వూరులో(చాపాడు)..

దువ్వూరు మండల పరిధిలోని పెద్దబాకరాపురంలో పశు వైద్యాధికారి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధకశాఖ సంయుక్తంగా పశు ఆరోగ్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో 4 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 52 లేగ దూడలకు, 461 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడం, 24 పశువులకు సాధారణ చికిత్స చేసినట్లు పశు వైద్యాధికారి చెప్పారు.

నేడు కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

బద్వేలు అర్బన్ : అర్బన్ పోలీసుస్టేషన్ సమీపంలోని సబ్‌జైలు ఆవరణలో గల శ్రీకనకదుర్గాదేవి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి చండీహోమం, మహాపూర్ణాహుతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ప్రదీప్‌కుమార్‌శర్మ తెలిపారు.

నిబంధనలతో ప్రమాదాల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, విద్యార్థులందరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి మురళీధర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం వెంకటేశ్వరా డిగ్రీ కాలేజీలో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం తోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. హెల్మెట్ ధరించి బైక్‌లో వెళ్తే రోడ్డు ప్రమాదానికి గురైనా స్వల్ప గాయాలతో బయటపడొచ్చని తెలిపారు. మైనర్లు ఎక్కువగా వాహనాలను డ్రైవింగ్ చేయడం సర్వసాధారమైందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కో ఆర్డినేటర్ గౌరీశంకర్, పృథ్వీనారాయణ, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ఎంవీఐలు రవీంద్రనాయక్, హేమకుమార్, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో సొంత స్థలం ఉండి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం ద్వారా సబ్సిడీ కింద సొంత ఇల్లు నిర్మించుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేయబడిన వారికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ పరిధిలోని వార్డు సచివాలయంలో ఉన్న అమినిటీ సెక్రటరీని కలిసి దరఖాస్తులు అందించాలని సూచించారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పాన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, స్థలం డాక్యుమెంట్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ పత్రాలను సమర్పించాలని తెలిపారు.

నేడు బద్వేలులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బద్వేలులోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, అల్ డిక్సన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ, పేటీఎంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఎల్ఐసీలో బీమా సఖి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18–50 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాన్ని బట్టి రూ.7–18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో విద్యార్హత, ఫొటోలతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : రాజుపాళెంలోని కోదండరామస్వామి దేవాలయం నుంచి ఏప్రిల్ 20వ తేదీన తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నట్లు తిరుమల పాదయాత్ర కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పాదయాత్రకు వచ్చిన వారందరికి ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దర్శనానికి సంబంధించిన (నేడు) శుక్రవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఏప్రిల్ నెలకు సంబంధించి ఆన్‌లైన్‌లో టికెట్లను విడుదల చేస్తున్నారని, కాలినడకన వచ్చు భక్తులంతా ఏప్రిల్ 26వ తేదీకి టికెట్లు బుక్ చేసుకోవాలని తెలిపారు.

నేడు బ్ర.మఠంలో వేలంపాట

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఉదయం పది గంటలకు దేవస్థానం ఆవరణంలో కొబ్బరి ముక్కల సేకరణ, పోలేరమ్మ వద్ద టెంకాయల విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణ, మరుగుదొడ్ల పరిశుభ్రత, యాత్రికుల విశ్రాంతి భవనంలో ధార్మిటరీల నిర్వహణకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ



పుల్లయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పూలతోటి పుల్లయ్యను ఎమ్మెల్యే డాక్టర్ సుధ గురువారం పరామర్శించారు. ముత్తుకూరు పంచాయతీ శలంగారిపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి కడపలోని ఎంఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.